క్లుప్తంగా

సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు భూమి పూజ



పిట్టలవానిపాలెం: మండలంలోని కోడూరు గ్రామంలో మురుగు పారేందుకు సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి, పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గ్రామ పంచాయతీల మ్యాచింగ్ రూ.48 లక్షల నిధులతో సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 1.4 కిలోమీటర్ల పొడవున ఈ డ్రెయిన్ నిర్మాణం చేయనున్నట్లు గ్రామ సర్పంచ్ ఐనంపూడి శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ, పార్టీ నాయకులు ఎండీ అఫ్జల్, దోమ నాగేశ్వరరెడ్డి, కిషోర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, దరియా, ఖాశిం, గ్రామ కార్యదర్శి బి.సుజాత, ఈఓపీఆర్డీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని గోకరాజునల్లిబోయినవారిపాలెం యూనిట్ సుస్థిర సేంద్రియ వ్యవసాయ ఐసీఆర్‌పీ చేబ్రోలు ఏసోబు తెలిపారు. మండల కేంద్రంలోని వరి పొలంలో సోమవారం వరి నారుమడిని శుద్ధి చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజామృతంతో వరినారును శుద్ధి చేయడం వల్ల వరిలో సంక్రమించే పలు రకాల తెగుళ్లు, చీడపీడలు ఆశించకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంతెనవారిపాలెం యూనిట్ ఎల్‌టీ సౌజన్య, ప్రవళిక జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

రోడ్డు మార్జిన్‌లో చదును



కొల్లూరు : రహదారుల అంచుల్లో ఉన్న అడ్డంకుల తొలగింపు ప్రక్రియ తోకలవారిపాలెం పంచాయతీ పరిధిలో నిర్వహించారు. మెరకలు, వ్యర్థపదార్థాలను, రోడ్లను కమ్మేసేలా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన సర్పంచి టి. కృష్ణమోహన్ పొక్లెయిన్ సాయంతో తోకలవారిపాలెం, తురకపాలెం గ్రామాల పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి, రహదారి విస్తరణ చేపట్టారు.

హాస్పిటల్ ప్రారంభం




వేమూరు(భట్టిప్రోలు): పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రైవేట్ వైద్యశాల ఏర్పాటు చేశామని వైఎస్సార్ సీపీ నాయకుడు కనపర్తి సుబ్బారావు తెలిపారు. భట్టిప్రోలు రైల్వే గేటు వద్ద హాస్పిటల్‌ను సోమవారం ప్రారంభించారు. రోగులకు 24 గంటలు వైద్య అందించనున్నట్లు పేర్కొన్నారు. కర్రం శెట్టి బాలు, జోస్ కాంత్, రమేష్, రవీంద్రబాబు, కోటేష్ లింగం, ప్రశాంత్, ఆనందరావు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతి

రేపల్లె రూరల్: చోడాయపాలెం గ్రామ సహాయకుడు మేడికొండ మాదవరావు సోమవారం మృతి చెందారు. తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అతని మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. వీఆర్‌ఏ అసోసియేషన్ సభ్యులు రూ.5వేల సాయం అందజేశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు రమేష్ మృతి



కర్లపాలెం: విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్.రమేష్(66) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఆయన సింగపూర్‌లో చిన్న కుమార్తె శాంతి వద్ద ఉంటున్నారు. సుమారు 35 ఏళ్ల ఉపాధ్యాయుడిగా, యూటీఎఫ్ నాయకుడిగా సమస్యల పరిష్కారంలో రమేష్ కృషి చేసినట్లు చెప్పారు. యూటీఎఫ్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని యూటీఎఫ్ స్థూపం వద్ద నివాళులర్పించారు. వెంకటేశ్వరరెడ్డి, పోలీసరావు, వైవీ నారాయణ, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శుల సమన్వయంతోనే..

గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యం



రేపల్లెలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు



పీవీ పాలెంలో శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులు

పిట్టలవానిపాలెం: సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందని ఈఓపీఆర్డీ కొల్లిపర పద్మజ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లకు సోమవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలన అంశాలు, సంక్షేమ పథకాల అమలు విధానాలను ఎప్పటికప్పుడు సర్పంచ్‌లకు కార్యదర్శులు తెలియజేయాలని సూచించారు. సర్పంచ్‌ల అధికారాన్ని సక్రమంగా అమలు చేసేందుకు సహకరించాలని కోరారు. పంచాయతీల్లో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే అన్ని శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. రాత్రిళ్లు వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మధుసూదన రెడ్డి, సర్పంచ్‌లు యేట్ర అశ్వినిరెడ్డి, బొలగాని అరుణకుమారి, కుంతం అనూష, ఎనుముల శివపార్వతి, దబ్బకూటి మాధవరావు, లక్కంరాజు ఆదిలక్ష్మి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పారిశుద్ధ్యం మెరుగు

చెరుకుపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగు పరచడానికి ఆయా గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో బి.శ్రీనివాసమూర్తి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. గ్రామంలో ప్రతి సర్పంచ్ పంచాయతీ రాజ్ చట్టంలో ఉన్న అధికారాలను గుర్తించి, పరిపాలనపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వాహణ, తడి, పొడి చెత్త వేరు చేసి వాటి ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసేలా చూడాలన్నారు. దానిని మార్కెటింగ్ చేసే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సునీత, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

విధులు, బాధ్యతలపై అవగాహన తప్పనిసరి

రేపల్లె రూరల్: గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలపై సర్పంచ్‌లు కనీస అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మల్లికార్జునరావు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీల విధులు, బాధ్యతలు, అధికారాలు, ఘన వ్యర్థ కేంద్రాల నిర్వహణ, వంద రోజుల పారిశుద్ధ్య కార్యక్రమాలపై రీసోర్స్ పర్సన్‌లు ఇంద్రజ, శ్రీనివాసరావు శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రత్నశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోపాల కృష్ణ, పంచాయతీ రాజ్ ఏఈ వేణుబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

సమన్వయంతో గ్రామాభివృద్ధి

వేమూరు(భట్టిప్రోలు): ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ దావూరి లలితకుమారి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ కేంద్రాలపై అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్లు వెంకటేష్ బాబు, సురేష్ శిక్షణ ఇచ్చారు. జెడ్పీటీసీ టి.ఉదయ భాస్కరి, ఇన్‌చార్జి ఎంపీడీవో టి.ఉషారాణి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రహదారుల అధ్వానంపై ప్రజా ప్రతినిధుల ఆక్రోశం

వాడీవేడిగా కొల్లూరు మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఏఈని నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

కొల్లూరు: ప్రయాణానికి ఏమాత్రం అనువుగా లేని రహదారి వ్యవస్థను మెరుగు పరచడంలో ప్రభుత్వ వైఫల్యంపై పలువురు ప్రజా ప్రతినిధులు ఆక్రోశం వెళ్లగక్కారు. సోమవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి, ఇతర రోడ్ల రహ'దారిద్ర్యం'పై ఆర్‌అండ్‌బీ ఏఈ ఎం.శివ నరశింహరావును రాజకీయాలకతీతంగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు నిలదీశారు. రహదారి అధ్వానంగా మారి మోకాళ్ల లోతు గుంతలతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. నిర్మాణం చేపట్టకపోవడంపై ముక్తకంఠంతో ప్రశ్నించారు. కొల్లూరు కరకట్ట దిగువ నుంచి గాజుల్లంక, పెసర్లంక రహదారి తటాకాలను తలపించే విధంగా నీటితో నిండి ఉండటతో సమస్యను సర్వసభ్య సమావేశంలోఉంచారు. రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ స్పందిస్తూ రహదారుల మరమ్మతులకు అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నూతన అంచనాలు కూడా పంపించామని చెప్పారు. దీనిపై సంతృప్తి చెందని ప్రజా ప్రతినిధులు రహదారి మెరుగుపరిచే విషయమై స్పష్టత ఇవ్వాలని పట్టుపట్టడంతో తన చేతిలో ఏమిలేదని ఏఈ బదులిచ్చారు. దీంతో ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు వద్దకు వెళ్లి సమస్యపై తేల్చుకుంటామని ప్రజాప్రతినిధులు తీర్మానించుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. చిలుమూరులంక అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించడకపోవడంపై సర్పంచి నరేష్ సీడీపీఓను ప్రశ్నించారు. పెసర్లంక అరవిందవారధి అడ్డుకట్ట పనులకు పరిషత్ నిధులు కేటాయించాలని పెసర్లంక ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పరిధిలో గతంలో మంజూరైన నిధులతో రక్షిత మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణాలు చేపట్టకపోవడంపై పలువురు ప్రశ్నించారు. అనంతరం ఎన్నికల విధుల్లో భాగంగా కృష్ణా జిల్లా మైలవరం నుంచి వచ్చిన ఎంపీడీఓ లక్ష్మీకుమారి బదిలీపై తిరిగి కృష్ణా జిల్లా వెళుతుండటంతో ఆమెను ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు సత్కరించారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, డీటీ నిరంజన్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలానికి వినతి



వినతి పత్రం అందజేస్తున్న శ్యామ్

నిజాంపట్నం: అంజనాపురం, గొంది మాలపల్లి గ్రామాలకు శ్మశాన వాటిక స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని సోషియల్ యాక్షన్, రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఏఆర్‌డీ) సొసైటీ డైరెక్టర్ అందే శ్యామ్ కోరారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి సొసైటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు సోమవారం వినతిపత్రం అందించారు. సదరు గ్రామాలకు శ్మశానవాటిక లేక మెయిన్ రోడ్డు పక్కనే సమాధి చేయాల్సి వస్తుందని వివరించారు. ప్రస్తుతం అక్కడ కూడా ఖాళీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరారు.

తగ్గిన వరద ఉద్ధృతి



కొల్లూరు: కృష్ణమ్మ శాంతించింది. నదిలో నీరు తగ్గడంతో తీర ప్రాంత వాసులకు భారీ ఊరట కలిగింది. గత ఆరు రోజులుగా కృష్ణమ్మ ఉద్ధృతంగా ప్రవహించింది. సోమవారం సాయంత్రానికి విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి నీటి విడుదలను 43 వేల క్యూసెక్కులకు పరిమితం చేశారు. ఎగువ నీరు తగ్గడంతో నదిలో 12 అడుగుల మేర ప్రవహించిన వరద నీరు క్రమేపీ తగ్గుతూ వచ్చి నది అడుగు భాగానికి చేరింది. మండలంలోని పెసర్లంక అరవింద వారధి ఎగువన ఏర్పడిన గండి వేసిన అడ్డుకట్టలో పలు చోట్ల కోతలు ఏర్పడ్డాయి.

ఆరోగ్యమే మహాభాగ్యం



కూరగాయలు విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కర్లపాలెం: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని ప్రకృతి వ్యవసాయం బాపట్ల డివిజన్ మాస్టర్ ట్రైనర్ గంజి శ్రీకాంత్ తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాల వద్ద సోమవారం కూరగాయలు విక్రయించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద మండే మార్కెట్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నామని తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ టీచర్లకు పనిభారం తగ్గించాలి



వేమూరు(భట్టిప్రోలు) ఉపాధ్యాయుల సర్దుబాటు నేపథ్యంలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరిగిందని ఏపీఎస్ ఎస్‌టీఎఫ్ అసోసియేట్ అధ్యక్షుడు గుర్రం మురళీ మోహన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఇటీవల పని సర్దుబాటులో భాగంగా సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల పోస్టులు తగ్గించిందన్నారు. పక్క రాష్ట్రాల్లో భూగోళ శాస్త్రం, చరిత్ర, అర్థ శాస్త్రాలను ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తుండగా.. ఏపీలో ఒక్కరే బోధిస్తున్నారని చెప్పారు. ఇక్కడ కూడా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం సర్దుబాటు చేయాలి



నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

రేపల్లె రూరల్: పాఠశాల విద్య, పని సర్దుబాటు ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయులు మండల విద్యా వనరుల కేంద్రం వద్ద నిరసన తెలిపారు. జి.నాంచారయ్య మాట్లాడుతూ జీఓ నంబర్లు 117, 128లు కాకుండా 2020లో గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబరు 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలన్నారు. పని సర్దుబాటులో సీనియర్లకు విల్లింగ్ అవకాశం కల్పించడంతో పాటు ప్యానల్ నంబరు, ర్యాంక్‌ను పరిగణలోకి తీసుకోవాలన్నారు. పని సర్దుబాటు ప్రక్రియను డివిజన్, మండల స్థాయికే పరిమితం చేయాలని స్పష్టం చేశారు. 70శాతం అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులను, వచ్చే ఏడాది ఏప్రిల్ 30వ తేదీలో పదవీ విరమణ చేసే ఉపాధ్యాయులను సర్దుబాటు నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోషలిజం, టి.శ్రీనివాసరావు, రత్నబాబు, అంకయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ బహిష్కరణ

పిట్టలవానిపాలెం: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు మండలంలోని పలు ఉపాధ్యాయ సంఘాలకు నాయకులు కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు బోధిస్తున్నారని వారు తెలిపారు. సర్‌ప్లస్ పేరుతో ఉపాధ్యాయులను తగ్గిస్తే విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు తగ్గే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యాప్టో పిలుపు మేరకు మండలంలోని ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. ఎంఈఓలు రాజారత్నం, వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ఉపాధ్యాయులు పరిశ నరసింహారెడ్డి, బుడ్డా నాగాంజనేయులు, ఎల్.చక్రపాణి, రమేష్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



వేమూరు: మండలంలో స్వాతంత్య్ర దినోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో శేష గిరిరావు పేర్కొన్నారు. తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. స్వాతంత్య్ర సమర యోధులను సన్మానించి, పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వం, గేయ పోటీలు నిర్వహించాలని సూచించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయాలన్నారు. నిర్వహణకు సంబంధించి మైనర్, మేజరు పంచాయతీలకు రూ.10 వేలు, రూ.25 వేలు కేటాయించినట్లు చెప్పారు. గ్రామస్థాయి అధికారులు పాల్గొనాలని ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు ఫిర్యాదులు



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో హెలా షారోన్ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శ్మశానం పోరంబోకు డొంకను సర్వే చేయించాలని నల్లూరు నార్త్‌కు చెందిన తొట్టెంపూడి బుచ్చిరామకృష్ణ, అదే గ్రామంలో అక్రమంగా తవ్విన రొయ్యల చెరువులను నిలిపివేయాలని, బోర్ల ద్వారా నీరు తోడటం వంటి ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరుతూ గ్రామస్తులు మరో అర్జీ అందించారన్నారు. మోర్తోట గ్రామంలోని రామాలయం గుడికి సంబంధించిన భూమిలో కంతేటి సాంబశివరావు అనే వ్యక్తిని మట్టిని అడ్డుగా వేయడంతో రహదారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తుడు దివి మారుతి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారుల ద్వారా త్వరితగతిన వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

కలుపు నివారణ చర్యలతో పంటకు మేలు



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చెరుకుపల్లి: రైతులు వరిలో మొదటి నుంచే కలుపు నివారణ పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల శాఖ, రైతు శిక్షణ కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ హుస్సేన్ రైతులకు సూచించారు. కావూరులోని వరి పొలాలను ఏఓ టి.బాలాజీ గంగాధర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాస్త్ర వేత్తలు సోమవారం సందర్శించారు. జింక్, ఐరన్ లోపం నివారణకు పలు సూచనలు చేశారు. ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ ఎంటి బాలపాప ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం ప్రయోజనాలను వివరించారు. వాటిని తయారు చేసుకునే పద్ధతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ బాలమురళీధర్ నాయక్, డాక్టర్ జె.రాధాకృష్ణ, ఏఈవోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అన్నదాతకు తప్పని శ్రమదానం



కొల్లూరు : సాగునీటి కోసం రైతులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. పంట కాల్వల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవడంతో నీటి పారుదల మందగించింది. రైతులే శ్రమించి కాల్వలను బాగు చేసుకొని పంటలు ఎండిపోకుండా కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కొల్లూరు–ఈపూరు గ్రామాల మధ్యలో ఉన్న టింపర్ కాల్వలో చెట్లు, కూలిన వంతెన గోడల రాళ్లతో నీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. నీటిపారుదల శాఖాధికారులు, టీడీపీ నాయకుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో చివరకు రైతులే కాలువను బాగు చేసుకొన్నారు. కొల్లూరు ఉత్తర ప్రాంతంలోని ఆయకట్టుకు నీరందించే కాల్వ నుంచి నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట కాల్వలకు సాగునీరు విడుదల చేసిన దగ్గర నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన వరికి నీరందక పంట ఎండిపోతుండటంతో చేసేది లేక రైతులు మూకుమ్మడిగా పంట కాల్వలో ఉన్న చెట్లు, బండరాళ్లను తొలగించుకొని పొలాలకు నీరు పారేలా బాగుచేసుకున్నారు.

రెడ్ క్రాస్ చైర్మన్ గౌరీ శంకర్‌కు అభినందన



డాక్టరేట్ అందుకున్న గౌరీ శంకర్

నిజాంపట్నం: వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన తనకు భారత సేవారత్న–2024, గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం ఆనందంగా ఉందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల చైర్మన్ కాశేపల్లి గౌరీ శంకర్ పేర్కొన్నారు. సోమవారం గౌరీశంకర్‌కు అభినందన సభ నిర్వహించారు. రెడ్‌క్రాస్, వాసవీ క్లబ్, సమరసత సేవా ఫౌండేషన్ ద్వారా 2,118 ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. మనం ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గత ఆదివారం హైదరాబాద్‌లోని సీటీ కల్చరల్ సెంటర్‌లో స్వతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డులను ప్రదానం చేశారని తెలిపారు. సినీ ప్రముఖులు మూసా అలీఖాన్, యువ హీరో కిరణ్ కుమార్ అందజేసినట్లు చెప్పారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు, పలువురు ఆయనను అభినందించారు.

చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్ రాజా

చెరుకుపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ మా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దోనేపూడి దిలీప్ రాజా పేర్కొన్నారు. సోమవారం చెరుకుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సినిమా రంగం అభివృద్ధికి రాష్ట్రంలో ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తారో.. ఏ విధమైన సహకారం, రాయితీలు అందిస్తారో తెలపాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో నిర్మాతలు ఏపీలో సినిమాలు తీయడానికి ఆసక్తి చూపుతారని చెప్పారు. తెలంగాణ, చెన్నై, కర్ణాటక కంటే ఏపీ సహజ సిద్ధమైన ప్రకృతి అందాలు షూటింగ్‌కు అనువుగా ఉన్నాయని గుర్తుచేశారు. సినిమా టిక్కెట్ల రేట్ల విషయంలో ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని దిలీప్ రాజా విజ్ఞప్తి చేశారు. రూ.5కోట్ల లోపు బడ్జెట్ సినిమాల ప్రదర్శనకు థియేటర్ల యాజమాన్యాలు సహకరించట్లేదని చెప్పారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి ఇప్పటికే సమస్యలు వివరించామని, మరోమారు తన వంతు కృషి చేస్తానని దిలీప్ రాజా చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అచ్చన శ్రీనివాస యాదవ్, జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు.

కార్తిక్ ఫౌండేషన్ అధ్యక్షుడికి డాక్టరేట్



వేమూరు: కార్తిక్ ఫౌండేషన్ ఫౌండర్ నందూరు కార్తీక్ డాక్టరేట్ అందుకున్నారు. హైదురాబాద్‌లో ఆదివారం మన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు కడగండ్ల చక్రవర్తి డాక్టరేట్ అందజేశారు. కోడిపర్రు గ్రామానికి చెందిన కార్తీక్ పౌండేషన్ అధ్యక్షుడు నందూరు కార్తీక్ విద్యార్థులకు అందిస్తున్న సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేశారు.

కిట్స్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో సోమవారం డేటా సైన్స్ విభాగంలో అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తమిళనాడు ఐసీటీ అకాడమీ సీనియర్ టెక్నికల్ ట్రైనర్ కుమార్ గురు ఇన్నోవేటివ్ రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్‌పై వివరించారు. చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ఎఫ్‌డీపీ ద్వారా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతి డాక్టర్ బి.భానుప్రకాష్, వివిధ కళాశాలల నుంచి హాజరైన అధ్యాపకులు పాల్గొన్నారు.